క్లుప్తంగా

ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి



ఎయిడ్స్‌పై అవగాహన వీధినాటకం ప్రదర్శిస్తున్న కీర్తన కల్చరల్ సొసైటీ కళాకారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఎయిడ్స్ మహమ్మారి బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వివరిస్తూ నగరానికి చెందిన కీర్తన కల్చరల్ సొసైటీ కళాకారులు వీధి నాటకం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించారు. శనివారం స్థానిక ఐఎంఎల్ డిపో వద్ద జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీధి నాటకంలో పలు విషయాలను ప్రజలకు వివరించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో, ఐసీటీసీ కేంద్రాల్లో హెచ్‌ఐవీ నిర్ధారణ పరీక్ష చేయించుకోవచ్చని తెలిపారు. స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరు నాకో యాప్‌ని డౌన్లోడ్ చేసుకోవాలని, తద్వారా హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై మరింత సమాచారం తెలుసుకోవచ్చని తెలియజేశారు. హెచ్‌ఐవీ రోగులను ఆదరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిరియాల కుమార్, మిరియాల తిరుపతి, వీర్నాల రాజేష్, వీర్నాల రమేష్, మిరియాల సాయి, వీర్నాల వాణి తదితర కళాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నేటి విద్యార్థులు భవిష్యత్తులో దేశానికి ఉపయోగపడే శాస్త్రవేత్తలుగా ఎదగాలని, నూతన ఆవిష్కరణల దిశగా తమ ఆలోచనలను కేంద్రీకరించాలని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని పిలుపునిచ్చారు. స్థానిక నెల్లూరు రవీంద్ర భారతి స్కూల్లో విద్యార్థుల సైన్స్ ఎక్స్‌పోను శనివారం జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టులను సందర్శించి వారిని ఆశీర్వదించారు. ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, పాఠశాల ప్రిన్సిపాల్ శిరీష ఫాయిజ్, డీన్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

అలరించిన స్వరాంజలి



ఘంటసాల పాటలు ఆలపిస్తున్న గాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన ఘంటసాల సంగీత కళాశాల, హైదరాబాద్‌కు చెందిన గోవింద్ మల్టీ టాలెంట్ ఆర్ట్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన స్వరాంజలి కార్యక్రమం ప్రేక్షకులను విశేషంగా అలరించింది. శనివారం రాత్రి స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలుగు చలనచిత్ర రంగానికి చెందిన 9 మంది రచయితలు రచించగా 9 మంది సంగీత దర్శకులు రూపొందించిన శత గీతాలాపన చేశారు. ఘంటసాల సంగీత కళాశాల అధ్యక్షురాలు రేవతీ రామ్‌కుమార్, లంకా వెంకటేశ్వర్లు, మనస్విని, టీ. సాయి కుమార్, వీ. రాజేష్ మీనన్, సీహెచ్. కళ్యాణ్, డీ. నరేష్ తదితర గాయకులు ఆయా ఘంటసాల పాటలను శ్రావ్యంగా ఆలపించారు. గోవింద్ మల్టీ టాలెంట్ ఆర్ట్స్ సంస్థ అధినేత టీ. గోవిందరావు సంగీత సారథ్యంలో,వీ. రామ్‌కుమార్ నిర్వహణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హిందూ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొనగా కార్యక్రమాన్ని నంది అవార్డు గ్రహీత ఎండీ ఖాజావలీ పర్యవేక్షించారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

ఏలూరు (టూటౌన్): విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించి మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బాలకాశి కోరారు. స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్‌లో శనివారం మీటర్ రీడర్స్, ఎనర్జీ అసిస్టెంట్లు, కాంట్రాక్ట్ కార్మికుల జిల్లా జనరల్ బాడీ సమావేశం మల్లేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకాశి మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో మీటర్ రీడర్స్ 20 ఏళ్లుగా పనిచేస్తున్నా వారికి ఉద్యోగ భద్రత లేదన్నారు. స్మార్ట్ మీటర్లు వస్తున్న నేపథ్యంలో మీటర్ రీడర్లకు సంస్థలో ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి షిఫ్ట్ ఆపరేటర్లుగా నియమించాలన్నారు. మీటర్ రీడర్స్‌కు యాజమాన్యం ఇస్తున్న పీస్ రేటును కాంట్రాక్టర్లు స్వాహా చేస్తున్నారని వీరందరికీ పీస్ రేటును పెంచాలని కోరారు. విద్యుత్ సంస్థలో 25 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులున్నారని వీరందరినీ క్రమబద్ధీకరించాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే, జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఎనర్జీ అసిస్టెంట్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మంజునాథ, గారపాటి దుర్గారావు, పెనుమాక జాకోబ్ పాల్గొన్నారు.

దుష్టచతుష్టయానికి బుద్ధి చెప్పాలి

- ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని
- డివిజన్ల వారీగా కార్యకర్తలతో సమావేశం



ఏలూరు 3వ డివిజన్‌లో కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఇడా చైర్మన్ బొద్దాని



ఏలూరు 20వ డివిజన్‌లో కార్యకర్తలతో ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షాన నిలబడి ఒంటరిగా పోరాటం చేస్తుంటే దుష్టచతుష్టయం నీచ రాజకీయాలు చేస్తూ పేదల పొట్టకొట్టేందుకు మరోసారి ఏకమవుతున్నాయని వాటికి ప్రజలు బుద్ధి చెప్పాలని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్లనాని అన్నారు. ఏలూరులో శనివారం పలు డివిజన్లల్లో ఆయన కార్యకర్తలు, ముఖ్య నేతలతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఏలూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కేడర్‌లో హుషారు కనిపిస్తుండగా ప్రతిపక్షాలు డీలపడ్డాయి. ఏలూరు నగరంలోని 3వ డివిజన్, 20, 21, 22 డివిజన్లల్లో ముఖ్య కార్యకర్తలు, నేతలతో ఎమ్మెల్యే ఆళ్ళ నాని మమేకమయ్యారు.ఏలూరు వన్‌టౌన్‌లోని 3వ డివిజన్ నవాబుపేట కాలనీలో పైలా కనకారావు ఇంటి వద్ద డివిజన్ కార్పొరేటర్, మాజీ స్మార్ట్ సిటీ చైర్‌పర్సన్ బొద్దాని అఖిల, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆళ్ళ నాని కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలంతా ఏకతాటిపై నిలుస్తూ పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఈ ఐదేళ్ళ కాలంలో అనేక సంక్షేమ పథకాలు, పేద వర్గాలకు అందజేశామని, మరోసారి ప్రజలకు మంచి జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని చెప్పారు.

21, 22 డివిజన్‌లో..

ఏలూరు టూటౌన్‌లోని 21, 22 డివిజన్లల్లో డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, కార్పొరేటర్ అన్నపనేని భారతి, శ్రీభారతి విద్యా సంస్థల అధినేత అన్నపనేని రవికుమార్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ఆళ్ళ నాని మాట్లాడుతూ గతంలో చంద్రబాబు హయాంలో ఏలూరు నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. ఐదేళ్ల కాలంలో ఏలూరు నియోజకవర్గంలో రూ.500 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టగా, రూ.447 కోట్లు సంక్షేమ పథకాలు అందజేశామని చెప్పారు.

20వ డివిజన్‌లో..

ఏలూరు టూటౌన్‌లోని 20వ డివిజన్ సీఆర్‌రెడ్డి కళాశాల బ్రిడ్జి వద్ద చింతా కృష్ణంరాజు ఇంటి వద్ద 20వ డివిజన్ కార్పొరేటర్ గుడూరి ఆదిలక్ష్మి, పార్టీ నాయకులు గుడూరి ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆళ్ళ నాని మాట్లాడుతూ ఏలూరు జిల్లా వాసుల చిరకాల కోరిక ప్రభుత్వ మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేసి కేవలం రెండేళ్లల్లోనే భవనాలు నిర్మించి ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభించిన ఘనత మన ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, కార్పొరేటర్లు, పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలు హాజరయ్యారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



జిల్లా న్యాయసేవాధికార భవన్‌లో మాట్లాడుతున్న మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్

ఏలూరు (టూటౌన్): పర్యావరణంలో మార్పుల వల్ల వ్యాధులు ప్రబలుతున్నాయని, పర్యావరణ పరిరక్షణలో అందరూ బాధ్యత వహించాలని దీంతో పాటు పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్ అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో శనివారం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల నివారణకు మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి రామగోపాల్ మాట్లాడుతూ పరిశుభ్రమైన జీవితాన్ని అవలంభించడం ద్వారా కొన్ని వ్యాధుల నుంచి బయట పడవచ్చునన్నారు. జంక్ ఫుడ్స్ దూరంగా ఉండి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే సమాజానికి మెరుగైన సేవలు అందిస్తారని కావున ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలన్నారు. డాక్టర్ వి.భవ్యశ్రీ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి అనారోగ్యానికి గురైనప్పుడు అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యుని సంప్రదించి మెరుగైన వైద్యాన్ని పొందాలని అన్నారు. అనంతరం కోర్టు సిబ్బందికి న్యాయవాదులకు చెవి, ముక్కు,గొంతుకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి

లక్కోజు గోపికి అభినందనల వెల్లువ



లక్కోజు గోపికి అభినందనలు తెలియజేస్తున్న స్వర్ణకారుల సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్) : వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నగర అధ్యక్షుడిగా నియమితులైన లక్కోజు రాజగోపాలాచారిని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు పట్నాల శేషగిరిరావు అభినందించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల స్వర్ణకార సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్న లక్కోజు గోపిని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నగర అధ్యక్షుడిగా నియమించడం పై ఆయన హర్షం వ్యక్తం చేసారు. శనివారం ఏలూరులో లక్కోజు గోపిని కలిసి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ మొదటి నుంచి ఎమ్మెల్యే ఆళ్ల నాని స్వర్ణకారులను గుర్తించి అనేక పదవులను కేటాయించారన్నారు. గతంలో రాజగోపాలాచారిని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారని గుర్తు చేసారు. అనేక బీసీ కుల సంఘాలకు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి స్థలాలను, నిధులను కేటాయించి ఆళ్ల నాని తన ప్రాధాన్యతను చాటి చెప్పారన్నారు. విశ్వబ్రాహ్మణులకు కార్పొరేటర్‌గా అవకాశం కల్పించడంతో పాటు అనేక మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో విశ్వబ్రాహ్మణులు, బీసీలు వైఎస్సార్ సీపీకి అండగా ఉంటారన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నగర అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ల నానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

26న క్విట్ డబ్ల్యూటీవో నిరసన ప్రదర్శనలు

ఏలూరు (టూటౌన్): ఈనెల 26న వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రవేశ పెట్టిన ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లాలో నిరసన ప్రదర్శనలు చేపట్టాలని ఏపీ రైతు సంఘాల జిల్లా సమన్వయ కమిటీ పిలుపు నిచ్చింది. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌నందు ఏపీ రైతు సంఘాల సమన్వయ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు మాట్లాడుతూ రైతాంగానికి కార్మికులకు నష్టం కలిగించే వాణిజ్య సంస్థ ప్రతిపాదనలు వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని విమర్శించారు. రైతుల పంటల కొనుగోలు కేంద్రాలను రద్దు చేయాలని, వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధరలను రద్దు చేయాలని, వివిధ దేశాల ప్రభుత్వాలని డబ్ల్యూటీవో ఆదేశిస్తోందని అన్నారు. అలాంటి ఆదేశాల్ని తిరస్కరించాలని డిమాండ్ చేసారు. ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సున్నా వెంకట్రావు, ఏఐఆర్‌టీడబ్ల్యూఫ్ జిల్లా కార్యదర్శి జె.గోపి, నగర అధ్యక్షుడు చక్రాల అమర కుమార్, వి.సాయిబాబు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యం, విశ్వాసంతో లక్ష్య సాధన సులభం



విద్యార్థులకు సర్టిఫికెట్లు, పతకాలు అందజేసిన అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతి విద్యార్థి ఏదో ఒక లక్ష్యం కలిగి ఉండాలని, దానిని సాధించడానికి నిరంతరం కృషి చేయాలని ఏలూరు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ సూచించారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన సెంట్రల్ ఎక్సైజ్ దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందుగా చిన్న లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధిస్తే మనలో ఆత్మస్థైర్యం పెరుగుతుందని, అదే ఆత్మస్థైర్యం, విశ్వాసంతో పెద్ద లక్ష్యాలు సాధించడం సులభతరమవుతుందని స్పష్టం చేశారు. ప్రణాళిక ప్రకారం చదివితే సివిల్స్ అత్యంత సులువుగా సాధించవచ్చన్నారు. 1944లో సాల్ట్‌యాక్ట్‌తో సెంట్రల్ ఎక్సైజ్ యాక్ట్ ఏర్పడిందని, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్ అందించిన సేవలకు గుర్తుగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వంగా వెంకటేశ్వర రావు మాట్లాడుతూ 1944 సెంట్రల్ ఎక్సైజ్ అండ్ సాల్ట్ యాక్ట్ భారతదేశ పరోక్ష పన్నుల చరిత్రలో ముఖ్యమైన మైలురాయి అని, చెల్లాచెదురుగా ఉన్న ఎక్సైజ్ సుంకాలను ఒకే చట్టం కిందకు చేర్చిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డీవీవీ ఫణి కుమార్, హెచ్‌ఓడీ పీ. అరుణ జ్యోతి, తెలుగు అధ్యాపకురాలు పీ. సౌభాగ్యలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బీ.లోకేష్‌కుమార్ పాల్గొన్నారు.

మార్చి 9న అంజుమన్ ఎన్నికలు



సమావేశంలో పాల్గొన్న అంజుమన్ సంస్థ పాలకవర్గ సభ్యులు, ఎన్నికల కమిటీ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో ముస్లింలకు విశేష సేవలు అందించే ప్రతిష్ఠాత్మక సంస్థ అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థ పాలకవర్గ ఎన్నికలు నిర్వహించడానికి కమిటీ తీర్మానించిందని ఆ సంస్థ అధ్యక్షుడు ఎండీ సులేమాన్ తెలిపారు. శనివారం స్థానిక అంజుమన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పాలక వర్గం పదవీ కాలం ముగిసిన అనంతరం ఎన్నికలు నిర్వహించాలని భావించినా కొన్ని సాంకేతిక కారణాల వల్ల అది సాధ్యం కాలేదన్నారు. సంస్థకు అడ్‌హక్ కమిటీ నియమించి నూతనంగా సభ్యులను తీసుకున్నామన్నారు. ప్రస్తుతం సాంకేతిక సమస్యలన్నీ కొలిక్కి రావడంతో ఎన్నికలు నిర్వహించాలని తమ పాలక వర్గం తీర్మానించిందన్నారు. ఎన్నికల కమిటీని నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి చదలవాడ వెంకటరమణారావు మాట్లాడుతూ అంజుమన్ సంస్థకు ఎన్నికలు నిర్వహించడానికి షెడ్యూల్‌ను రూపొందించామన్నారు. నగరంలోని 15 జోన్లకు సంబంధించి 35 స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఈ ఎన్నికల్లో ఓటు వేయడానికి 2,773 మందికి అర్హత ఉన్నట్లు గుర్తించామన్నారు. మార్చి 1, 2 తేదీల్లో నామినేషన్లు స్వీకరిస్తామని, 3న నామినేషన్ల పరిశీలన, 4న ఉపసంహరణ ప్రక్రియ, 5న పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల గుర్తుల కేటాయిస్తామని తెలిపారు. మార్చి 6 నుంచి 8వ తేదీ వరకూ ప్రచార గడువు ఉంటుందని, 9న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. అనంతరం అదే రోజు లెక్కింపు ప్రారంభించి విజేతలను ప్రకటిస్తామన్నారు. సమావేశంలో ఎన్నికల కమిటీ సభ్యులు ఉప్పులూరి హేమశంకర్, షేక్ ఇబ్రహీం, మహ్మద్ ఇలియాస్, అంజుమన్ పాలకవర్గ సభ్యులు షేక్ అమీర్ జానీ, మహీదుల్లా షరీఫ్, మున్వర్ షరీఫ్, సయ్యద్ బాజీ, ఎండీ జావీద్ పాల్గొన్నారు.

నిధులు మంజూరైన పనులను ప్రారంభించండి

ఏలూరు (మెట్రో): జిల్లాలో వివిధ శాఖల నిధుల ద్వారా మంజూరై ఇంకా ప్రారంభంకాని నిర్మాణాలకు సంబంధించి మార్చి 2వ తేదీలోగా పనులను ప్రారంభించాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశపు హాలులో శనివారం వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో పనుల ప్రగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామ /వార్డ్ సచివాలయ భవనాలు, ఆర్‌బీకే, వెల్నెస్ సెంటర్ భవనాలు తదితర నిర్మాణ పనులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వాటిలో 83 శాతం వరకు పూర్తి అయ్యాయని, మిగిలిన నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో ఎన్నికల కోడ్ రానున్న దృష్ట్యా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలన్నారు. ఈనెల 28వ తేదీలోగా టెండర్ ప్రక్రియలు పూర్తిచేయాలని, పనులను మార్చి, 2వ తేదీ లోగా ప్రారంభించాలన్నారు. నిర్మాణ పనులు పూర్తయిన భవనాలను ఈనెల 28వ తేదీ లోగా ప్రారంభించాలన్నారు.సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఎం.సూర్యతేజ, గృహ నిర్మాణ సంస్థ పీడీ రవికుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.శర్మిష్ఠ, డీఈఓ అబ్రహం, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, రోడ్లు భవనాల శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్లు కేదారేశ్వరరావు, సత్యనారాయణ, జాన్ మోషే, ఐసీడీఎస్ పీడీ పద్మావతి పాల్గొన్నారు.

ఎన్నికల్లో నేరాలను సహించం

ఎస్పీ మేరీ ప్రశాంతి



ఏలూరు టౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు పటిష్ట చర్యలు చేపట్టామని, ఎన్నికల్లో నేరాలకు పాల్పడే వ్యక్తుల పట్ల అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్షించారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాలను అధికారులు ముందుగా తనిఖీలు చేసి సౌకర్యాలపై ఆరా తీయాలన్నారు. రాష్ట్ర, జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో నిత్యం వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. రౌడీషీటర్లను ముందుగా బైండోవర్ చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఎన్‌బీడబ్ల్యూలను అమలు చేసి నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరచాలన్నారు. ఏజెన్సీ, కొల్లేరు ప్రాంతాల్లో నాటు తుపాకీలను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. మద్యం, సారా, నగదు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై ఉన్నతాధికారులకు నివేదించాలని ఆదేశించారు. జిల్లా ఏఎస్పీ జి.స్వరూపరాణి, సెబ్ ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్చమ్మ పేరంటాలమ్మకు విశేష పూజలు

దెందులూరు : సంతాన లక్ష్మిగా, కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గాలాయగూడెం గ్రామ దేవత అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయం వద్ద నిప్పుల గుండం (అగ్నిగుండం) కార్యక్రమం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అగ్నిగుండం ప్రవేశం చేసేందుకు భక్తులు వేలాది మంది పోటీపడ్డారు. ఆలయ కమిటీ, పెదవేగి సీఐ కే.శ్రీనివాస్, దెందులూరు ఎస్సై కే స్వామి, సిబ్బంది భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. రెండు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని ప్రదక్షిణలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు.

ముగిసిన దత్త క్రియా యోగ శిక్షణ తరగతులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : నగరానికి చెందిన హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న దత్తక్రియా యోగ ఉచిత శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. అవధూత గణపతి సచ్చిదానంద స్వామి వద్ద దత్త క్రియ యోగాలో శిక్షణ పొందిన వేణుగోపాల్ లునాని పీ.సాంబశివరావు తర్ఫీదు నిచ్చారు. ఈ సందర్భంగా శిక్షకులను హిందూ యువజన సంఘం ప్రతినిధులు యర్రా సోమలింగేశ్వరరావు, బీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, మజ్జి కాంతారావు శాలువా, మెమొంటోలతో సత్కరించారు. సోమలింగేశ్వరరావు మాట్లాడుతూ మనుషుల దైనందిన జీవితంలో యోగ, ధ్యానం భాగం కావాలన్నారు. మజ్జి కాంతారావు, వైఎంహెచ్‌ఏ సభ్యులు టీ. లోకేష్, వైద్యులు శానం విజయ మోహన్ రావు, ఎల్.నాగేశ్వరావు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 51 కేంద్రాలు



మాట్లాడుతున్న పరీక్షల కమిటీ కన్వీనర్ ప్రభాకరరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో వచ్చేనెల 1 నుంచి జరిగే ఇంటర్మీడియెట్ పరీక్షలకు 51 కేంద్రాలను ఏర్పాటుచేసినట్టు జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ బి.ప్రభాకరరావు తెలిపారు. శనివారం స్థానిక సీఆర్‌ఆర్ కళాశాలలో పరీక్షల అధికారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయని, ప్రతి కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఏలూరు కోటదిబ్బ జూనియర్ కళాశాలలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామని, 08812 230197 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు. ఉద యం 8.30 గంటలకు విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని, 9 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని స్పష్టం చేశారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విద్యార్థులతో పాటు సిబ్బంది సెల్‌ఫోన్లు తీసుకురాకూడదన్నారు. జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు ఎం.యోహాన్, జి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎం.పేర్రాజు, జిల్లా బల్క్ ఇన్‌చార్జి పి.జ్యోతి పాల్గొన్నారు.

వ్యాయామ విద్యకు ఉజ్వల భవిష్యత్తు

దెందులూరు: ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ (రాజమండ్రి) అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వీ.దేవనంద్ శనివారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నత్తానియేల్ అధ్యక్షతన వివిధ అంశాలను విద్యార్థులకు బోధించారు. భవిష్యత్తులో వ్యాయామ విద్యకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. శిక్షణ సమయంలో క్రమశిక్షణ, సత్ప్రవర్తన, నిరంతర సాధన కలిగి ఉండాలన్నారు. అనంతరం అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను ప్రిన్సిపల్ నత్తానియేలు, విద్యార్థులు ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	07
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	14
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	29
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	02
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	09
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	06
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	23
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	08
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	11
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	29